క్లుప్తంగా

వైభవంగా వెంకన్న కల్యాణం

అంబాజీపేట: కొర్లపాటివారిపాలెంలో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో మొక్కుబడి కల్యాణాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన మేడిది సూర్య ప్రకాశరావు కుమార్తె మోపూరి శ్రీనివాస్, ఉమామహేశ్వరి దంపతులతో ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగపల్లి నరసింహాచార్యుల బ్రహ్మత్వంలో స్వామివారి కల్యాణాన్ని శుక్రవారం నిర్వహించారు. స్వామి దేవేరుల ఉత్సవమూర్తులతో ఆలయం చుట్టూ ప్రదర్శన చేసి కల్యాణాన్ని జరిపించారు. స్వామి కల్యాణాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కల్యాణంలో పాల్గొన్న మహిళా భక్తులకు తాంబూలాలు అందజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన చేపట్టారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మేడిది శ్రీనివాసరావుతో పాటు ఆలయ కమిటీ సభ్యులు, శ్రీవారి భక్తుల పాల్గొన్నారు.

అన్నదానం ట్రస్టుకు రూ.10 వేల విరాళం



దాతకు స్వామి చిత్రపటం అందిస్తున్న పర్యవేక్షకుడు సత్యమూర్తి

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదానం ట్రస్టుకు పెదపట్నంలంకకు చెందిన కొమ్ముల వెంకటలక్ష్మీ మంగతాయారు, వారి కుటుంబ సభ్యులు శుక్రవారం రూ.10,116 విరాళంగా అందించారు. ఈ విరాళాన్ని ఆలయ పర్యవేక్షకుడు సత్యమూర్తికి అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు అర్చకులు వేద ఆశీర్వచనం అందించారు. స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

వైద్యుల సేవలు అభినందనీయం



డాక్టర్ సాయిప్రసాద్‌ను సత్కరిస్తున్న అధ్యక్ష, కార్యదర్శులు అయ్యప్పనాయుడు, ప్రసాద్

రాజోలు: వైద్యుల సేవలు అభినందనీయమని రాజోలు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చింతా ప్రసాద్ అన్నారు. రాజోలు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో సేవలు అందించిన మెడ్‌లైఫ్ వైద్యులు, రాజోలు దంత వైద్యశాల డాక్టర్ దొడ్డా పి.సాయి ప్రసాద్‌లను ఘనంగా సత్కరించారు. అలాగే వైద్య శిబిరం ఏర్పాటుకు సహకారం అందించిన అధ్యక్షుడు యర్రంశెట్టి అయ్యప్పనాయుడు, సీనియర్ న్యాయవాది కేపీఆర్ఎస్ నాయుడులకు కృతజ్ఞతలు తెలిపారు.

అనుమతి లేని కళాశాలల్లో చేరవద్దు

రాజోలు: ప్రభుత్వ అనుమతి, గుర్తింపు లేని కళాశాలల్లో విద్యార్థులు చేరవద్దని ఏఐఎస్ఎఫ్ నాయకుడు దేవ రాజేంద్రప్రసాద్ శుక్రవారం తెలిపారు. రాజోలులో ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో పుట్టగొడుగుల్లా వ్యాపించిన ప్రైవేటు కళాశాలలు ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని విస్తరిస్తున్నారన్నారు. సఖినేటిపల్లి మండలం రామేశ్వరంలో ఏర్పాటు చేయాల్సిన ఒక ప్రైవేటు కళాశాలను మలికిపురం మండలం గుడిమెళ్లంకలో ఏర్పాటు చేసి అడ్మిషన్లు చేసుకుంటున్నారన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు సరైన అవగాహన లేకపోవడంతో అనుమతులు లేని కళాశాలల్లో చేర్పించి భవిష్యత్‌లో ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రావులపాలెం: మండలంలోని ఈతకోట సబ్ స్టేషన్ పరిధిలో నూతనంగా 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడానికి శనివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 8 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని అమలాపురం ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రాంబాబు శుక్రవారం తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ఈతకోట, పొడగట్లపల్లి, లక్ష్మీ పోలవరం, కేతరాజుపల్లి, బొక్కావారిపాలెం, దేవరపల్లి పంచాయతీ పరిధిలోని అన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

మొదటి స్థానంలో నిలపాలి

మామిడికుదురు: ఉద్యోగులు కష్టపడి పని చేసి తమకు ఇచ్చిన లక్ష్యాలను త్వరితంగా పూర్తి చేసి మండలాన్ని మొదటి స్థానంలో నిలపాలని ఎంపీడీఓ జి.భవాని సూచించారు. మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులతో శుక్రవారం సమీక్ష సమావేశం ఏర్పాటు నిర్వహించారు. గ్రామాల వారీగా పలు శాఖల పని తీరుపై పరిశీలన చేశారు. విధి నిర్వహణలో ఏ ఒక్క ఉద్యోగి అలసత్వం చూపకుండా పని చేయాలన్నారు. ప్రతి ఒక్క అంశంలో మొదటి స్థానమే మన లక్ష్యంగా ముందుకు వెళ్లాలని సూచించారు. మీకు ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. వాటిని పరిష్కరిస్తామని చెప్పారు. సచివాలయాల్లో ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సమయపాలన విధిగా పాటించాలని ఆదేశించారు. సమావేశంలో తహసీల్దార్ పి.సునీల్‌కుమార్, ఏఓ ఎన్వీవీ సత్యనారాయణ, ఈఓపీఆర్డీ అడబాల శ్రీనివాసరావు, ఏఓ కె.వెంకటేశ్వరరావు సమావేశంలో పాల్గొన్నారు.

రైతులకు అందని ధాన్యం సొమ్ము

- జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు
- సమస్యలపై సభ్యుల ప్రశ్నల వర్షం



సమావేశంలో ధాన్యం సొమ్ములపై అధికారులను నిలదీస్తున్న జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు

అయినవిల్లి: ధాన్యం కొనుగోలు చేసి రెండు నెలలు దాటిన ఇంకా సొమ్ములు రైతులకు చెల్లించకుండా ప్రభుత్వం తాత్సారం చేయడంపై జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు శుక్రవారం ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన స్థానిక మండల సర్వసభ్య సమావేశంలో ధ్వజమెత్తారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సొమ్ములు రైతుల సకాలంలో అందించేలా చర్యలు తీసుకోవాలని ఆయన మండల వ్యవసాయాధికారి వై.శోభను కోరారు. దీంతో వ్యవసాయ అధికారి వై.శోభ బదులిస్తూ మండలంలో 641 మంది రైతులకు గాను రూ.21 కోట్లు ఇవ్వాల్సి ఉందన్నారు. ఈ నెలాఖరుకు ఈ సొమ్ములు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమవుతాయని ఆమె తెలిపారు. అలాగే పీహెచ్‌సీ అధికారులు గ్రామల్లో డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే వరదల సమయం దగ్గర పడటంతో పాముకాటు, కుక్కకాటు మందులను ప్రజలకు అందుబాటులో ఉంచాలని జెడ్పీటీసీ శ్రీనివాసరావు కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ లోవోల్టేజీ సమస్యతో బాధపడుతున్నట్లు పలు గ్రామల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. పలు గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని, విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని సమావేశంలో విద్యుత్‌శాఖ అధికారులను కోరారు. మాగం, శానపల్లిలంక గ్రామాల్లో స్థలం ఇచ్చిన ఇప్పటివరకూ అంగన్‌వాడీ కేంద్ర భవనాలను నిర్మించలేదని ఐసీడీఎస్ అధికారులకు అ గ్రామ సర్పంచులు వివరించారు. పలు గ్రామాల్లో మంచినీటి ట్యాంకుల నిర్మాణం పూర్తి చేసిన ఇప్పటికీ పైపు లైన్ల ద్వారా మంచి నీటిని సరఫరా చేయక పోవడంపై ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కల్యాణ్‌కు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీవీ సరోవరరావు, తహసీల్దార్ సీహెచ్ విద్యాపతి, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

పలు వ్యాధుల బాధితులకు ఆర్థిక సాయం



గూడపల్లిలో కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం అందిస్తున్న సంఘ సభ్యులు



రావులపాలెంలో బాధితురాలికి సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు



పుల్లేటికుర్రులో సాయాన్ని అందిస్తున్న సాయినాథ్, జయచంద్ర

మలికిపురం: మండలంలోని గూడపల్లి గ్రామానికి చెందిన మోకా అంజికి గుబ్బలపాలెం గ్రామానికి చెందిన ది లార్డ్స్ ప్రేయర్ హౌస్ సంస్థ ఆర్థిక సాయం అందించింది. అంజికి రెండు కిడ్నీలు పాడయి చాలా అనారోగ్యంతో ప్రతి రెండు రోజులకు డయాలసిస్‌కి వెళుతున్నారు. వీళ్ల కుటుంబం చాలా పేదరికం కావడంతో ఈ కుటుంబానికి అంజి పెద్ద దిక్కుగా ఉన్నాడు. దీంతో సంస్థ అధ్యక్షుడు మట్టా రాంబాబు ముందుకు వచ్చి సంస్థ ద్వారా రూ.10 వేల ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందించారు. నేతల నాని, సంఘ సభ్యులు పాల్గొని సంస్థ సేవలను అభినందించారు. అలాగే గూడపల్లి-గుబ్బల పాలేనికి చెందిన గంటి నాగమణికి గృహ నిర్మాణం కోసం మట్టా రాంబాబు రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు.

ప్రమాద బాధితురాలికి..

రావులపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడి కాలు పోగొట్టుకున్న బాధితురాలికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు శుక్రవారం రూ.17 వేల ఆర్థిక సాయం అందజేశారు. పాలకొల్లుకి చెందిన గూడూరి సరస్వతి (19) 6 నెలల క్రితం మార్టేరు దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ కాలు మీద నుంచి వెళ్లిపోవడంతో ఒక కాలు తీసేశారు. ప్రస్తుతం ఆవిడ 6 నెలల గర్భవతి. కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరగా రావులపాలెంలో సరస్వతి అక్క ఇంటికి వెళ్లి సంస్థ సభ్యులు చేతుల మీదుగా సరస్వతికి రూ.17 వేలు చెక్కు అందజేశారు.

వెలుగు ఉద్యోగి కుటుంబానికి..

అంబాజీపేట: ఈ ఏడాది మే నెలలో అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమానికి వెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వెలుగు ఉద్యోగి కమ్యూనిటి కో ఆర్డినేటర్ నాగరాజు కుటుంబానికి రూ.11 లక్షలను శుక్రవారం రాత్రి పుల్లేటికుర్రులో అందజేశారు. నాగరాజు కుటుంబానికి ఆదుకునేందుకు జిల్లా వ్యాప్తంగా ఉన్న తోటి ఉద్యోగులు, మహిళా సంఘాలు, వీవోఏలు, గ్రామ సంఘాల సమకూర్చిన రూ.11 లక్షలను నాగరాజు భార్య భారతికు అందజేశారు. ఈ సాయాన్ని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.సాయినాథ్, జయచంద్ర చేతుల మీదుగా అందజేశారు. నాగరాజు ఇరువురు పిల్లలకు చెరో రూ.5 లక్షలు చొప్పున పోస్టల్ శాఖ ద్వారా ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించామన్నారు. సెర్ప్ సంస్థ నుంచి రావలసిన పారితోషకం, ఇన్సూరెన్స్ సకాలంలో వచ్చేలా చేస్తామన్నారు. మృతుడి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీడీ నాగేశ్వరరావు, వరాలబాబు, ముత్తాబత్తుల వెంకటేశ్వరరావు, భూపతి వర్మ పాల్గొన్నారు.

తూకాల్లో తేడా లేకుండా రేషన్ పంపిణీ చేయాలి



అంబాజీపేటలో ఎంఎల్ఎస్ పాయింట్‌ను తనిఖీ చేస్తున్న ఆర్డీఓ శ్రీకర్

అంబాజీపేట: రేషన్ దుకాణాలకు పంపిణీ చేసే నిత్యావసరాల్లో తూకాల్లో తేడా లేకుండా ఎంఎల్ఎస్ పాయింట్ అధికారులు శ్రద్ధ తీసుకోవాలని కొత్తపేట ఆర్డీఓ పి.శ్రీకర్ అన్నారు. అంబాజీపేట ఎంఎల్ఎస్ పాయింట్‌ను శుక్రవారం తనిఖీ చేశారు. ఆర్డీవో మాట్లాడుతూ ఎమ్మెల్యే పాయింట్ నుంచి పంపిణీ చేసే సరకుల్లో తూకాలు సక్రమంగా ఉండాలన్నారు. తూకాల్లో తేడాలు ఉంటే చర్యలు తప్పవన్నారు. అమలాపురం, అంబాజీపేట, అల్లవరం, అయినవిల్లి, ఉప్పలగుప్తం మండలాలకు ఈ పాయింట్ నుంచి బియ్యం, పంచదార, ఆయిల్, కందిపప్పు సరఫరా చేస్తున్నామన్నారు. అలాగే మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి రైసును పంపిణీ చేస్తున్నామన్నారు. సింగిల్ కార్డు కలిగి ఉన్నవారికి ఇంటి వద్దకే ఆయా రేషన్ షాపుల ద్వారా రైస్‌ను పంపిణీ చేస్తున్నామన్నారు. గొడౌన్ల వద్ద పరిశుభ్రంగా ఉంచాలని అపరిశుభ్రంగా ఉంచకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అంతకు ముందు ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద ఉన్న సరకుల వివరాలను తనిఖీ చేశారు. ఆర్డీవో వెంట ఇన్‌చార్జి తహసీల్దార్ బి.చిన్నబాబు, ఆర్ఐ కె.ఏడుకొండలు, ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జి ఎస్.సత్యనారాయణ, వీఆర్వోలు రమేష్, జీవీ రమణ ఉన్నారు.

దేవస్థానం భూముల కౌలు సాగుకు వేలం

కొత్తపేట: మండలంలోని మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్వర) స్వామి వారి దేవస్థానం, ఆ క్షేత్ర పాలకుడు వేణుగోపాలస్వామి వారి దేవస్థానం భూముల కౌలు వేలం పాటలు శుక్రవారం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో దేవస్థానం ఈఓ డి.సురేష్‌బాబు ఆధ్వర్యంలో ఆయా ఆలయాల భూములను కౌలుకు సాగు చేసుకొనుటకు టెండరు కం, బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. ఆయా భూముల పాటలు, ఆదాయ వివరాలు ఈఓ సురేష్‌బాబు వివరించారు. దేవస్థానానికి చెందిన 14.71 సెంట్ల భూమికి గత సంవత్సరం రూ.3,56,000 శిస్తు ఉండగా ఈ సంవత్సరం రూ.4,44,000 ఆదాయం వచ్చింది. రూ.88,000 ఆదాయం పెరిగింది. భక్తుల సామాన్లు భద్రపరిచే క్లాక్ రూంకు రెంటు, వాహనాల పార్కింగ్ లైసెన్సు హక్కునకు గత సంవత్సరానికి రూ.1,14,500 ఉండగా ఈ సంవత్సరం రూ.1,60,500 వచ్చింది. రూ.46,000 అధికంగా వచ్చింది. ఈ వేలం పాటలకు పర్యవేక్షణాధికారిగా రావులపాలెం మండలం పొడగట్లపల్లి జానకియమ్మ సత్రం ఈఓ ఎం.రాధాకృష్ణ పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, దేవస్థానం సిబ్బంది, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

అమరవీరులకు అశ్రు నివాళి



సంధిపూడిలో నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీ

ఆలమూరు: కర్తవ్య నిర్వహణలో అమర వీరులైన ఆలమూరు ఎస్సై ముద్దాల అశోక్, కానిస్టేబుల్ ఎస్.బ్లెస్సన్ జీవన్‌లిద్దరికి యావత్ మండల ప్రజానీకం శోకతప్త హృదయాలతో అశ్రు నివాళులు అర్పించింది. రోడ్డు ప్రమాదంలో వారిద్దరూ మృతి చెందడాన్ని స్థానికులు ఇంకా జీర్ణించుకోలేక పోతున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజలు రాజకీయ, కులమతాలకు అతీతంగా ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి అశ్రు నివాళులర్పిస్తూ తన సంతాపాన్ని తెలియజేస్తున్నారు. గ్రామాల ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రగాఢ సానుభూతి తెలియ.ఉస్తూ మృతుల కుటుంబాలకు బాసటగా నిలుస్తున్నారు. గురువారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి తమ ప్రేమాభిమానాలను చాటుకున్నారు. అనంతరం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సంస్మరణలో మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

చెరువుల తవ్వకానికి అనుమతులు ఇవ్వవద్దు

అయినవిల్లి: నేదునూరు, అయినవిల్లి గ్రామాల్లో తమ భూములను ఆనుకుని కొంత మంది బడాబాబులు రొయ్యల చెరువులు తవ్వేందుకు చర్యలు చేపడుతున్నారని దీంతో బంగారం పండే భూములు చౌడు బారతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను పెద్ద ఎత్తున రైతులు కలిసి వినతిపత్రం అందజేశారు. తమ భూములకు ఆనుకుని ప్రభుత్వ అధికారులు రొయ్యల చెరువుల తవ్వకాలకు అనుమతులు ఇవ్వవద్దని నిరసన వ్యక్తం చేశారు. రొయ్యల చెరువులు తవ్వితే తమ పంట చేలు ఎందుకు పనిచేయకుండా పోతాయని తినే కొన్ని మెతుకులు కూడా దొరకవని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేను కలసిన వారిలో రైతులు మిండగుదిటి రాంబాబు తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ ఆదర్శ ఉద్యోగులకు నగదు అవార్డులు



రాజోలు డిపోలో మొక్క నాటుతున్న డీపీటీఓ రాఘవకుమార్

రాజోలు: ఆర్టీసీ ఆదర్శ ఉద్యోగుల నగదు అవార్డులను శుక్రవారం డీపీటీఓ రాఘవకుమార్ ప్రదానం చేశారు. 2023–24 ఏడాదికి సంబంధించిన నగదు అవార్డులను ఉద్యోగులకు అందజేశారు. అత్యధిక ఆయిల్ ఆదా చేసిన డ్రైవర్లకు, అత్యధిక ఈపీకే సాధించిన కండక్టర్లకు నగదు అవార్డు, ప్రసంసా పత్రాలు అందజేశారు. డిపో పరిధిలోని అన్ని విభాగాలను ఆయన పరిశీలించిన ఆయన డిపో ఆవరణలో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ అవార్డులు అందుకున్న ఉద్యోగులను స్ఫూర్తిగా తీసుకుని మిగిలిన ఉద్యోగులు విధి నిర్వహణ చేయాలన్నారు. రాజోలు డిపో మేనేజర్ పి.జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

విపత్తుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన

అయినవిల్లి: విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ముక్తేశ్వరం ఎస్ఎన్‌వీఆర్ ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు ఎన్డీఆర్ఎఫ్ పదో బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ భూపేంద్ర కుమార్ వివరించారు. శుక్రవారం ముక్తేశ్వరం ఎస్ఎన్‌వీఆర్ కళాశాలలో అధ్యాపకులు సామ్ ఏబెల్ ఆధ్వర్యంలో భూపేంద్రకుమార్ మాక్‌డ్రిల్ ద్వారా వరదలు, తుపాన్, ఏదైనా ప్రకృతి విపత్తులు, ప్రమాదాలు సంభవించినప్పుడు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ప్రజలకు ఏ విధంగా సహాయపడతారో వివరించారు. వరదల్లో మునిగిన, పాముకాటు, ప్రమాదంలో చిక్కుకున్న వారిని ఎలా కాపాడాలో ఆయన వివరించారు. అలాగే విద్యార్థులు తమ వంతుగా సహాయక చర్యల్లో పాల్గొనేలా శిక్షణ నిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొహర్రం సంతాప దినాలు ప్రారంభం

కొత్తపేట: మహ్మద్ ప్రవక్త మనుమలు హసన్, హుస్సేన్ త్యాగాలను స్మరించుకుంటూ నిర్వహించే మొహర్రం సంతాప దినాలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. గురువారం రాత్రి ఆకాశంలో నెలవంక చూసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.కొత్తపేట కమ్మిరెడ్డిపాలెం మసీదులో మసీదు, షాదీఖానా కమిటీ ప్రెసిడెంట్ షేక్ కాజాబాబు ఆధ్వర్యంలో మసీదు ఇమామ్ ఇంతియాజ్ అహ్మద్ మొహర్రం ప్రాముఖ్యతను, ప్రవక్త మనుమలు, వారి పరివారం ప్రాణ త్యాగాలను గురించి వివరించారు. వారి పవిత్ర ఆత్మశాంతికి ప్రార్థనలు జరిపారు.

విద్యార్థి కిట్ల పరిశీలన

ఆలమూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీని జిల్లా అబ్జర్వర్ అబ్దుల్ ఘని శుక్రవారం పరిశీలించారు. స్థానిక పాఠశాలలోని స్టాక్ పాయింట్ వద్ద సీఎంవో సుబ్రహ్మణ్యంతో కలసి విద్యార్థులకు యూనిఫాం, బూట్ల నాణ్యతను పరీక్షించారు. అనంతరం రికార్డులను పరిశీలించి పలు సూచనలు, సలహాలను అందజేశారు. మండల విద్యాశాఖ అధికారులు బి.అప్పాజీ, పి.సుబ్బరాజు, సీఆర్ఎంటీలు పాల్గొన్నారు.

వెలుగు ఏపీఎంపై ఎమ్మెల్యేకి ఫిర్యాదు

మలికిపురం: మండల వెలుగు అసిస్టెంట్ మేనేజర్, అకౌంటెంట్లపై లక్కవరం క్లస్టర్ వీవోఏలు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. మండలంలో క్లస్టర్ కోఆర్డినేటర్ పోస్టులు ఖాళీగా ఉండడంతో ప్రభుత్వం తరఫున వివిధ యాప్‌ల నమోదు కోసం సీసీ లాగిన్ తప్పనిసరిగా ఉండాలని ఈ నేపథ్యంలో లక్కవరం క్లస్టర్‌కు అదే క్లస్టర్ నుంచి కాకుండా పక్క క్లస్టర్‌కు చెందిన వీవోఏకు సీసీ లాగిన్ ఇచ్చి సహాయకురాలిగా వేశారని పేర్కొన్నారు. దీని వల్ల సంఘ సభ్యులు అంత దూరం వెళ్లలేరని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదును స్వీకరించిన ఎమ్మెల్యే దేవ ఏపీఎంతో ఫోన్ మాట్లాడారు. దీనిపై తగిన చర్యలు తీసుకుని ఏ క్లస్టర్‌లో వాళ్లను అదే క్లస్టర్‌లో వేయాలని ఆదేశించారు. ఫిర్యాదు చేసిన వారిలో నక్కా సువర్ణ, జి.ప్రమీల, ఎం.రాజకుమారి, ఎం.పెద్దిరాజు, జి.కరిష్మా ఏసుదాసు ఉన్నారు.

అప్పారావు మాస్టారుకు సత్కారం

అంబాజీపేట: విద్యార్థులను ఆకట్టుకునే విధంగా విద్యారంగంలో నూతన ఒరవడితో గుర్తింపు తెచ్చుకున్న అప్పారావు మాస్టారు అందరికీ ఆదర్శనీయుడని ఎంఈఓ మోకా ప్రకాష్ అన్నారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ఐకాన్ 2025 అవార్డు స్వీకరించిన తొండవరం హైస్కూల్ పూర్వ ఆంగ్ల ఉపాధ్యాయుడు ఆదుర్తి వెంకట అప్పారావును అంబాజీపేట మండల విద్యాశాఖ కార్యాలయంలో శుక్రవారం ఎంఈఓ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీఆర్పీలు నెల్లి వెంకటేష్, పి.గోవిందరాజు, తానేటి నాగరాజు, ఎంఆర్సీ అసిస్టెంట్ శ్రీను, కంప్యూటర్ ఆపరేటర్ దేవి, పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్స్ పెయ్యిల రాజేశ్వరి, గొల్లాది రాంబాబు, మట్టపర్తి సూరిబాబు, ఎ.సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణపై అవగాహన కల్పించాలి

ఆలమూరు: గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన పెంచడం ద్వారా సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పాలని రామచంద్రపురం డివిజనల్ పంచాయతీ అధికారి, ఎంపీడీఓ ఎ.రాజు పిలుపునిచ్చారు. ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏపీఎం ఎం.ధనరాజు అధ్యక్షతన శుక్రవారం జరిగిన డ్వాక్రా యానిమేటర్లు, సమాఖ్య సభ్యుల సమావేశానికి ఎంపీడీఓ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రామాలను చెత్త రహితంగా తయారు చేసి ప్రజలందరికీ మెరుగైన ఆరోగ్యాన్ని అందించేందుకు ప్రతి రోజు ప్రత్యేక ప్రణాళికతో చెత్త సేకరణను అమలు చేస్తున్నామన్నారు. గ్రామాల్లో జరుగుతున్న సంపూర్ణ పారిశుధ్యంపై డ్వాక్రా సంఘాలు గ్రామ పంచాయతీలకు సహాయ సహకారాలు అందించాలని ఎంపీడీఓ విజ్ఞప్తి చేశారు. మండల వెలుగుశాఖ సహకారంతో అర్హులైన మహిళలందరూ డ్వాక్రా రుణాలు తీసుకోవాలని, అదేవిధంగా సక్రమంగా చెల్లించాలని ఎంపీడీఓ రాజు, ఏపీఎం ధనరాజు కోరారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు వీరే..



సాధనాల రమేష్



కొక్కిరి రవికుమార్



చొల్లంగి వీవీ అర్జునరావు

పి.గన్నవరం: నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఆదేశాలు జారీ చేసింది. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఈ నియామకాలు జరిగాయి. పి.గన్నవరం మండలం ఊడిమూడి గ్రామానికి చెందిన నగరం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాధనాల రమేష్‌ను నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా, పి.గన్నవరానికి చెందిన కొక్కిరి రవికుమార్ నియోజకవర్గ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడిగా, ఎల్.గన్నవరానికి చెందిన ఆర్ఎంపీ చొల్లంగి వీవీ అర్జునరావు (చిట్టిబాబు) డాక్టర్స్ వింగ్ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. వీరిని పలువురు నాయకులు, కార్యకర్తలు అభినందించారు. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ సిఫారసు మేరకు ఈ నియామకాలు జరిగాయి. ఇంకా పలు విభాగాలకు అధ్యక్షులను నియమించారు.

పార్టీ వైభవానికి గ్రామ స్థాయి నుంచి పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ అబ్జర్వర్ మార్గాని గంగాధర్

అయినవిల్లి: పార్టీ పూర్వ వైభవానికి గ్రామ స్థాయి నుంచి పనిచేయాలని పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, నియోజకవర్గ మండల కమిటీ, అధ్యక్ష పదవీ నియామక అబ్జర్వర్లు మార్గాని గంగాధర్, పీకే రావు అన్నారు. మండలంలోని తొత్తరమూడి వీవర్స్ కమ్యూనిటీ భవనంలో శుక్రవారం పార్టీ సీనియర్ నాయకులు కుడుపూడి విద్యాసాగర్ అధ్యక్షతన పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. వీరు మాట్లాడుతూ పార్టీ ఉన్నతికి గ్రామ స్థాయి నుంచి సైనికుల్లా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, పార్టీ సీనియర్ నాయకులు మందపాటి కిరణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఎస్‌బీఐ ఉద్యోగుల రక్తదానం



రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న ఎస్‌బీఐ ఉద్యోగులు

రాజోలు: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 70 వసంతాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో రాజోలు ఎస్‌బీఐ ఉద్యోగులు రక్తదానం చేశారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో అమలాపురం యెండూరి బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తాన్ని సేకరించారు. ఎస్‌బీఐ చైర్మన్ శ్రీనివాసులుశెట్టి పిలుపు మేరకు 70 వసంతాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో 70 వేల యూనిట్ల రక్తాన్ని సేకరించాలని పిలుపునిచ్చారన్నారు. దానిలో భాగంగా రాజోలు జోన్ పరిధిలోని ఎస్‌బీఐ ఉద్యోగులు, ఖాతాదారులు సుమారు 60 మంది రక్తదానం చేశారు. రీజనల్ మేనేజర్ అశోక్ నాగరాజన్, సత్యప్రసాద్, వీరభద్రరావు, రవికాంత్, ఆఫీసర్ల అసోసియేషన్ ప్రాంతీయ కార్యదర్శి కానూరి సురేష్‌కుమార్, విజయ్‌కుమార్, వర్మ, సూర్యనారాయణ, స్టాఫ్ యూనియన్ క్యాదర్శి గణేష్, ఆదిమూలం దుర్గాప్రసాద్, పిన్నపు మోహన్, వెంకట రమణ, ప్రవీణ్, బ్రాంచి మేనేజర్ ఎస్ఎస్ఆర్ఎం ప్రసాద్, సాయిసర్వోత్తమ్, ఎంఆర్‌బిఆర్ గోపాలం, ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.